

# చూడ చక్కనైన బిడ్డ-మావాడు

దుల్బారావు గవర్నమెంటు ఉద్యోగి. ఆదివారం వస్తే అతనికి పండగ. అతని భార్యకి ఏం చేతకాకపోయినా వంటలో మాత్రం అందెవేసిన చెయ్యి. ఆహార విషయంలో అతని అభిరుచులు ఎంత సున్నితమైనవయినా, ఆమె వంటకాల్లో ఒక్క లోటు అతను వేలుపెట్టి చూపలేదు. అంచేత ఆదివారం అతను మంచి కులాసాగా ఉంటాడు. కనక, ప్రత్యేకంగా తమ కోరిక లేమన్నా ఉంటే, ఆనాటికి అట్టే పెడతారు, అతని భార్యా పిల్లలు.

ఫోటోకి పదేళ్ళు, ప్రొఫెసరు రామ్మూర్తి సర్కసు అప్పుడే వచ్చింది ఆ వూరికి. అది చూడాలని అతడి ఆత్రం. ఆ ఆదివారం ప్రత్యేకంగా చేసిన షిర్వాల్యో (ఒక వంటకం) తృప్తిగా భుజిస్తూ ఇల్లు ఎల్లా నడపా అన్న విషయంమీద సుదీర్ఘమైన ఉపన్యాసం యిస్తున్నాడు తండ్రి. అయితే షిర్వాల్యో రుచి చూస్తున్న తండ్రికి కోపం రాదని సాహసించి, ఫోటో తండ్రి దృష్టిని అతి చమత్కారంగా సర్కసు మీదికి మళ్ళించాడు.

ఫోటో అన్నయ్య మోరో — అతనికన్న నాలుగేళ్ళు పెద్ద, బుడతకీచు కాలేజీలో చదువుతున్నాడప్పుడే. తల్లి అప్పుడప్పుడిచ్చిన అణా బేడా జాగ్రత్తచేసి, ఇంట్లో ఎవ్వరికీ తెలీకుండా, మొట్టమొదటి ఆటే చూచి వచ్చేశాడతను. అంచేత—సర్కసేమంత బాగా లేదని వూళ్ళో అంతా అనుకుంటున్నారని చన్నీళ్ళు జల్లాడు. తండ్రిని మంచిమాట చేసుకోడానికి మోరో ఇల్లా అంటున్నాడని ఫోటోకి తెలుసు. అతను గట్టిగా వాదించాడు.

అసలు ఈ చాత్రో, కార్లేకర్, తారాబాయి, సర్కసు అన్నిటికన్నా రామ్మూర్తి సర్కసు చాలా గొప్పదన్నాడు. ఇంకే సర్కసులో నన్నా తెల్ల ఎలుగుబంటి ఉందా? ఆపైన రామ్మూర్తికి జిరాఫీ ఉంది. దాని పొడుగు పదిహేడడుగులు. అదీగాక, చిలక మూడు చక్రాల సైకిలెక్కి స్వారీ చేస్తుంటే, దాని భుజాలమీద ఉడత ఎక్కుతుంది.

అతని చెల్లెలు మాంకూ, కళ్ళప్పగించి వింటోంది. ఉత్సాహంగా అంది. "సర్కస్ చాలా గొప్పదై ఉండాలి. లేకపోతే ఫూలో వాళ్ళ నాన్న, దాన్ని మొదటి రోజు, మొదటి ఆటకే, ఎందుకు తీసుకెడతాడు ? ఈవేళ వాళ్ళ పెద్దన్నయ్య దాన్ని మళ్ళీ తీసుకెడుతున్నాడు తెలుసా ?" అనేసి పెద్దన్నయ్య వేపు మహా కోపంగా చూసింది.

దాంతో దుల్బారావు అభ్యంతరాలన్నీ పటాపంచలై పోయాయి. "సరే! సరే! ఇలాంటి చిలిపి సరదాలమీద డబ్బు దుబారా చెయ్యడమంటే నా కసహ్యం. మరి మీరంతా చూడాలని పట్టుదలగా ఉన్నారు. వద్దంటే మానుతారా ? ఒరే మోరో, పిల్లల్ని తీసకెళ్ళు. మీ అమ్మని కూడా" అన్నాడు.

"సరదా సంగతి అలా ఉంచండి." అంది అతని భార్య అమాయకంగా "కాని మన ఫోటో మహా చురుకైనవాడు. సర్కసులో విశేషాలన్నీ వాకబుచేసి అవన్నీ కంఠతా పట్టాడు."

ఈ పొగడ్త ఫోటోకి ఇబ్బందిగా పరిణమించింది. "నీ ముద్దుల కొడుకుని, నువ్వు ఇంతగా గారం చెయ్యబట్టే, నేను వాళ్ళ టీచరు ముందు తలెత్తుకోలేకుండా ఉన్నాను. మన ప్రబుద్ధుడు ఏడాదయింది బుడతకీచు బడిలో చేరి. ఏఏ సర్కసుల్లో, ఎన్ని జిరాఫీలు, ఎన్ని ఉడతలున్నాయో, కంఠస్థమే గాని, గోవాలో పదకొండు పరగణాల్లోనూ, ఆరింటిపేర్లే తెలుసు నీ కొడుక్కి. నిన్న రోడ్డుమీద నన్నాపి మరీ చెప్పాడు వాళ్ళ టీచరు. నీ ముద్దుల కొడుకు గెడకర్రలా ఎదిగి పోతున్నాడే గాని, వాడి బుద్ధి మాత్రం పెరగడంలేదు. వాడి పొట్ట వాడు పోసుకోలేడు. నాకు తెలుసు. వాడికి పెళ్ళి అవాలంటే, చివరకు నువ్వు ఇంటింటికీ పోయి, 'మా పిల్ల నిస్తారా ? మా పిల్ల నిస్తారా' అని బతిమాల వలసిందే— 'చూడ చక్కనైన బిడ్డ మావాడు' అని పాడుకుంటూ."

తండ్రి ఇలా ఎత్తి పొడిచేసరికి, మోరో, మాంకూ విరగబడి నవ్వారు. ఫోటో ముఖం ఎర్రబడింది. ముడుచుకు పోయాడు. తల్లి మాంకూ వంక తీక్షణంగా చూసింది.

"ఆడపిల్లవి, ఎనిమిదేళ్ళొచ్చాయి నెత్తిమీదికి, మంచీ, మర్యాదా తెలియక్కర్లే" అంది.

అయితే మాంకూ కులాసాని అరికట్టలేకపోయింది. కిలకిల నవ్వులతో మేళాయించి సాగదీస్తూ, పాటంతా పాడింది మాంకూ.

"చూడ చక్కనైన బిడ్డ మావాడు,
తాడిచెట్టు తాడులేక ఎక్కుతాడు.
పాడిగేదె లెన్నైనా కడుగుతాడు."

పాట పాడేసి, కొంటెగా తల్లివంక చూస్తూ, తండ్రిని గారంగా అడిగింది— "నాన్నా ! నాన్నా ! ఆ కుర్రాడి కథ చెప్పు నాన్నా. అలాంటి కథేదో విన్నట్టు జ్ఞాపకం. మరిచిపోయాను నాన్నా! చెప్పవూ ...." తల్లి ఆమెను మింగెయ్యాలన్నట్టు చూసింది. చూపులు మరో పక్కకి తిప్పేసింది మాంకూ.

ముగ్గురు పిల్లల్లోనూ మాంకూ అంటే మహా ముద్దు దుల్బారావుకి. కడసారి పిల్ల కనక, చిన్నతనం గడిచి పెళ్ళీడు దగ్గర పడేసరికి ఆ ముద్దు మరీ ఎక్కు

వెళ్ళింది. ఆమె కొంటెతనం తెలిసి కూడా తెలియనట్టుగానే ఆమె వంక ఆప్యాయంగా నవ్వుతూ చూశాడు. "మాంకూ తల్లీ, కథ అంటే నీ కెంత ఇష్టమమ్మా. అందులో ఇల్లాంటి చమత్కారమయిన కథలంటే మరీను. విను చెప్తా"—అంటూ మొదలు పెట్టాడు.

"నీకుతెలుసో తెలీదో—మన గోవా బ్రాహ్మ ల్లోనే, మరో శాఖవాళ్లున్నారు. మన సార స్వత బ్రాహ్మల్లాగ వాళ్లు చేపలు తినరు. వాళ్ల భాష చిత్రమయినది. కొంకణి, మహా రాష్ట్రం కలగాపులగం చేసి మాట్లాడు తారు. మాంసం తినకపోయినా, వాళ్లలో చాలామందికి, చదువూ సంధ్యా రాదు. వ్యవ సాయం, దూడల పెంపకం, వాళ్ల వృత్తి. చిత్ర మేమిటంటే, వాళ్లల్లో మగవాళ్ల కన్నా, ఆడవాళ్లు తక్కువ. అంచేత పిల్లా డికి పెళ్లి కావాలంటే వాడి తల్లితండ్రులు దండిగా ఓలివ్వాలి.

"వోమా టేమయిందంటే, వో పిల్లాడి తల్లి పొరుగున ఉన్న వో ఆడపిల్ల తల్లి దగ్గరకు వెళ్ళింది పిల్లని అడగడానికి. తన బిడ్డ గుణగణాలను వర్ణించడం మొదలుపెట్టింది.

"చూడ చక్కనైన వాడు, మావాడు
తాడులేక తాడిచెట్టు ఎక్కుతాడు.
పాడి గేదె లెన్నైనా కడుగుతాడు."

అంటూ పాట పాడింది.

"పిల్ల తల్లికి ఇవన్నీ మనసు కెక్కలేదు. మోహాన్ని కొట్టినట్టు పాటలోనే సమా ధానం చెప్పింది.

"ఏడు నూర్లు ఇవ్వగల మగవాడు
వాడే నా చిన్నదాని మగ డవుతాడు
తాడిచెట్టు ఎక్కనీ—పాడి గేదె కడగనీ
పీడాపోయ నాకుమాత్రం పనికిరాడు."

"అయ్యో పాపం ఆ తల్లికి, పది గేదెల్ని కడగగల తన బిడ్డంటే, ఎంత గర్వమో" అంటూ వాపోయింది మాంకూ, తన తల్లివేపు ఓరగా చూస్తూ.

తన చిన్నారి చెల్లెలు ఎగతాళి చేస్తుంటే, ఫోటో ఇంక భరించలేక పోయాడు. తనకు ఆకలి లేదంటూ లేచిపోయి చేతులు కడిగేసు కున్నాడు, మజ్జిగ పులుసు కలిపిన అన్నం మహా కమ్మగా వాసన వేస్తున్నా. తల్లి అప్పుడే పట్టుకొచ్చింది పాపం మజ్జిగ పులుసు వడ్డించడానికి. ఆవిడ మనస్సు చివుక్కుమంది.


అయినా ఏమీ అనలేకపోయింది.

మాంకూ మాత్రం తను చేసిన పనికి నొచ్చుకోలేదు. ఫోటో పడుతున్న బాధ చాలా వరకూ నాటకమని ఆమెకు తెలుసు. అది గాక వాళ్లమ్మ తన ముద్దుల కొడుక్కి ప్రత్యేకంగా ఆ సాయంకాలం ఎలాగా టిఫిన్ రెట్టింపు పెడుతుంది. తన అన్న గారూ తండ్రీ సరదాగా నవ్వడం చూసి ఆ భోజనాల రంగానికి మహా ఉత్సాహంగా భరతవాక్యం పాడింది.

"చూడ చక్కనైనవాడు మావాడు
తాడులేక తాడిచెట్టు ఎక్కుతాడు,
పాడిగేదె లెన్నైనా కడుగుతాడు."

రచయిత : వి. ఎస్. సుక్తాంకర్

అనువాదం : పొలగుమ్మి పద్మరాజు




'ఆంధ్రసచిత్ర వారపత్రిక'లో ప్రచురణకు ఇండియన్ ఇంక్ తో వేసిన కార్టూనులు మాత్రమే పంపాలి. సాధారణంగా 4" × 2", 4" × 4" చిత్రాలు పత్రికలో పడుతూ ఉంటాయి. సం॥

